హర్ ఘర్ తిరంగా సంబరాలు

జాతీయ జెండాతో పురవీధుల్లో ప్రదర్శనలు

భీమడోలు: హర్ ఘర్ తిరంగా సంబరాలు మంగళవారం అంబరాన్నింటాయి. హర్ ఘర్ తిరంగా అభియాన్ యాత్రలో భాగంగా పీఎం నరేంద్రమోదీ పిలుపు మేరకు జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. భీమడోలు బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో 50 అడుగుల జెండాను పట్టుకుని భీమడోలు జంక్షన్ నుంచి పోలసానిపల్లి గీతాంజలి కళాశాల విద్యార్థులు పురవీధుల్లో ప్రదర్శన చేశారు. మోటార్ బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మాట్లాడుతు జాతీయతాభావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. భీమడోలు నెం.4 పాఠశాలలోని సీసీఆర్‌టీ డీఆర్‌పీ ఎం శరీన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచర్లు జాతీయ జెండాను పట్టుకుని ప్రదర్శన చేశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ నేతృత్వంలో చిన్నారులు జెండాను పట్టుకుని ప్రదర్శన చేశారు. తొలుత ప్రతిజ్ఞను రచించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సుబ్బారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై.సుధాకర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, మండల కన్వీనర్ ప్రత్తి మదన్, నియోజకవర్గ కోకన్వీనర్ వెజ్జు ధర్మారావు, జిల్లా నాయకులు ఎం శ్రీనివాసశాస్త్రి, హెచ్‌ఎం బుల్లి దొర, కళాశాలల ప్రిన్సిపాల్స్ బొమ్ము రవికుమార్, ఎం.గౌతమ్ కుమార్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.


భీమడోలు : జంక్షన్ నుంచి 50 అడుగుల జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఉంగుటూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు నారాయణపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్, మహత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు భారీ పొడ ఉన్న జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీనియర్ సిటిజన్ జాతీ య ఉపాధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిడ్ల అలకానంద శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, వివిధ పార్టీ నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలి

గణపవరం: 78వ స్వాతంత్య్రం దినోత్సవం సందర్భంగా గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు గణపవరంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ప్రారంభించిన ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు అవుతున్నా ఇంకా పేదలందరికీ స్వాతంత్య్ర ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్ర పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కాలేజి గ్రౌండ్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి జయహో భారత్ అంటూ నినదించారు.


భీమడోలు : గాంధీబొమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దలు, విద్యార్థులు


గణపవరం : ప్రదర్శన చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు


ఉంగుటూరు: నారాయణపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

క్లుప్తంగా

మొక్కలు నాటిన విద్యార్థులు


మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, విద్యార్థులు

దెందులూరు: పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కల పెంపకం, వాటి సంరక్షణ, మిషన్ శక్తి బేటీ బచావో – బేటీ పడావో కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు సెయింట్ మెరిస్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ టీనా మరియా అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు 140 వివిధ రకాల మొక్కలను విద్యార్థులు, ఉపాధ్యాయులు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకుంటేనే పథకం లక్ష్యం నెరవేరుతుందన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన మోటారు సైకిలిస్ట్

దెందులూరు: జాతీయ రహదారిపై సత్యనారాయణపురం – గుండుగొలను సమీపంలో మంగళవారం నిద్రమత్తులో మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టాడారు. టూవీలర్ బండిపై పున్నారావు అనే వ్యక్తి విశాఖ నుంచి బయలుదేరి మచిలీపట్నం వెళ్తున్నాడు. గుండుగొలను వచ్చేసరికి నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొని స్పృహ తప్పి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది పున్నారావును అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పున్నారావును కాపాడారు.

రోడ్డుపై బురద తొలగింపు


వాకపల్లిలో రోడ్డుపై బురదను తొలగిస్తున్న కూలీలు

గణపవరం: సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చాలా గ్రామాల్లో రోడ్లపై బురద, మట్టి చేరి నడవడానికి ఇబ్బందిగా తయారయ్యాయి. దీంతో గ్రామ పంచాయతీలు ప్రక్షాళన చర్యలు చేపట్టాయి. వాకపల్లి గ్రామంలో రోడ్లపై చేరిన బురద, మట్టిని కూలీలు పారలతో తొలగించి, రోడ్డుపై నల్లకంకర దుమ్ము వేయడంతో ప్రజలు రోడ్డుపై రాకపోకలు సాగించడానికి అవకాశం ఏర్పడింది. పలు గ్రామాల్లో రోడ్లపై చేరిన మట్టిని ప్రొక్లెయిన్లు, కూలీల సాయంతో తొలగిస్తున్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై వర్క్‌షాప్


వర్మీ కంపోస్టుపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ గిరిధర్

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద వర్మీ కంపోస్టు తయారీపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. సర్పంచ్ బండారు సింధు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గిరిధర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. డీపీఆర్‌సీ భూషణం, ఎంవోటీ వెంకట్రావు, ముత్తయ్య శిక్షణ ఇచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, ఉపసర్పంచి జగదీష్, పంచాయతీ సభ్యులు సూరత్తుల అయ్యప్ప, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మరాజుకు జెండా అందజేత


ఎమ్మెల్యే ధర్మరాజుకు జెండాను అందిస్తున్న ఉద్యోగులు

ఉంగుటూరు: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు మండలంలోని పోస్టల్ ఉద్యోగులు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు జాతీయ జెండాను మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఉంగుటూరు సబ్ పోస్టు మాస్టార్ రామకృష్ణ, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.సుమన్, నిడమర్రు బీపీఎం పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

టాస్క్ పేరుతో మోసం

ఏలూరు టౌన్: ఏలూరు టూ టౌన్ ప్రాంతానికి చెందిన వ్యక్తి తనను ఆన్‌లైన్ టాస్క్ పేరుతో భారీగా సొమ్ము కాజేసి సైబర్ నేరగాళ్లు మోసం చేశారని పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ సీఐ ఎం ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు కొత్తపేట ప్రాంతానికి చెందిన ప్రదీప్ కుమార్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతనికి ఆన్‌లైన్‌లో లింక్ ఓపెన్ చేయగాం టాస్క్‌లు ఇస్తామని, వాటిని పూర్తి చేస్తే డబ్బులు సంపాదించే అవకాశం ఉందని నమ్మించారు. అతను దఫాలుగా టాస్క్‌లు పూర్తి చేయటంతో కొంత డబ్బులు అతని బ్యాంకు ఖాతాలో వేస్తూ ఆశ చూపించారు. అలా టాస్క్‌లు ఇస్తూ దఫదఫాలుగా సుమారు రూ.8 లక్షలు కాజేశారు. తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులను ఆశ్రయుంచాడు. సైబర్ పోలీసు సహకారంతో కేసును పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళా సాధికారతే లక్ష్యం


పెదపాడు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న సీడీపీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ తేజరతన్

పెదపాడు : మహిళల భద్రత, సాధికారత కోసమే మిషన్ శక్తి పథకం ప్రవేశపెట్టినట్టు సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. పెదపాడు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా 9వ వారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. మహిళలను ప్రభావితం చేసే సమస్యలను జీవిత చక్ర నిరంతర ప్రాతిపదికన పరిష్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజరతన్, ఈఓఆర్డీ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు ఎంపీడీఓగా పద్మావతి


పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఈఓ శ్రీనివాసరావు

భీమడోలు: స్థానిక ఎంపీడీఓగా సీహెచ్ పద్మావతి విధుల్లో చేరారు. ఆమె ఇటీవల జరిగిన ఎన్నికల్లో కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. అదే జిల్లాకు చెందిన టి.స్వర్ణలత భీమడోలు ఎంపీడీఓగా వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వారు తమ పాత స్థానాలకు వచ్చి చేరారు. పద్మావతిని ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

దెందులూరు: విద్యార్థులు మంచి భవిష్యత్ కోసం కష్టపడి చదువుకోవాలని గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అన్నారు. మంగళవారం గోపన్నపాలెం వ్యాయమ విద్య కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ డే అవగాహన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే వెంటనే భవిష్యత్ నిర్వీర్యమవుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సైతం విద్యార్థుల కదలికలు, ప్రవర్తనను అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. డీసీపీఓ సూర్యచక్రవేణి మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాలు సాధించేందుకు విద్యార్థులు నిరంతర శ్రమ, సాధన, ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. హాని కలిగించే ఏ విషయంలోనూ విద్యార్థులు ప్రవేశించకూడదన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నత్తానియేలు

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం


కొత్తూరులో బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న పోలీసులు

పెదపాడు : గ్యాస్ లీకై సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయురాలైన కొత్తూరు గ్రామానికి చెందిన దిమ్మిటి నాగేశ్వరమ్మకు టీడీపీ నాయకులు, పెదపాడు పోలీసులు ఆర్థిక సాయం అందించారు. ఇంటి వద్ద వంట చేస్తుండగా గ్యాసు లీకై బండ పేలి ఇల్లంతా కాలి బూడిదైంది. దీంతో నాగేశ్వరమ్మకు టీడీపీ నాయకులు నిత్యావసర సరుకులను అందజేశారు. ఎస్సై తన సిబ్బందితో కలిసి బాధితురాలికి 25 కేజీల బియ్యం, కూరగాయలు, దుప్పటి, చీరలను అందించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, చినబాబు, హెడ్ కానిస్టేబుల్ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

యూపీడబ్ల్యూఎఫ్ మండల కార్యవర్గం ఎంపిక

దెందులూరు: యూపీడబ్ల్యూఎఫ్ దెందులూరు మండల నూతన కార్యవర్గం మంగళవారం ఎంపికైంది. గౌరవ అధ్యక్షులుగా సీహెచ్‌పీ విలియమ్స్, బి.రత్నప్రసాద్, కె.చిన్నమోషే, బెంజిమెన్, బీకే డానియేల్, అధ్యక్షులుగా మోహన్‌పాల్, ఉపాధ్యక్షులుగా రాకేష్‌బాబు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పాస్టర్ శ్యాంబాబు, కోశాధికారిగా ఎలీషా, ఉపకోశాధికారిగా మనోహర్ ఎంపికయ్యారు. మండలంలో పాస్టర్ల అసోసియేషన్ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, ఆధ్యాత్మిక అభివృద్ధికి కృషి చేస్తుందని గౌరవ అధ్యక్షుడు విలియమ్స్ తెలిపారు.

17న వాహనాల బహిరంగ వేలం పాట

భీమడోలు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 17వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ భీమడోలు సీఐ ఎం.గిరిజా సత్యకుమారి తెలిపారు. భీమడోలు, ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న 22 ద్విచక్ర వాహనాలు, ఒక కారుకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బైక్‌కు రూ.5వేలు, కారుకు రూ.15 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సీఐ తెలిపారు.

ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు

పెదపాడు : మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో అతనిని పెదపాడు పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వీరమ్మకుంట గ్రామంలో పెద్దింట్లమ్మ గుడి అర్చకుడు మిరియాల సోమశేఖర ప్రసాద్ కుమారుడు రాజ్‌కుమార్ తన తండ్రి మందలించాడని మనస్థాపం చెందాడు. ఆత్మహత్యకు పాల్పడుతున్నాడంటూ వీరమ్మకుంట గ్రామానికి చెందిన పృథ్వి అనే వ్యక్తి 112కు ఫోన్ ద్వారా సమాచారం అందిండంతో వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అతన్ని వారి బంధువులకు అప్పగించారు. వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణాభివృద్ధికి కృషి

దెందులూరు: గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలని అధికారులు సూచించారని ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. సామర్లకోట శిక్షణా కేంద్రంలో శిక్షణలో భాగంగా ఆమె పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాలు, నిబంధనలను వివరించారని తెలిపారు.

ఓటర్ల సర్వే నిర్వహించాలి

ఏలూరు(మెట్రో): సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలతో మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటా ఓటర్ల సర్వే జరుగుతుందని చెప్పారు.

అమ్మవారికి ఉయ్యాల సమర్పణ


ఉయ్యాలను అందిస్తున్న రాందాసు, అతని కుమారులు

ఉంగుటూరు: కైకరంలో పేరుగాంచిన నాగమ్మతల్లికి తయారుచేయించిన ఉయ్యాలను యండా రాందాసు అతని కుమారులు మంగళవారం ఆలయానికి అందజేశారు. దాతలను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఏలూరు(మెట్రో): మిషన్ శక్తి బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం క్రింద 100 రోజుల ప్రత్యేక అవగాహన, నషా ముక్త్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించాలన్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్, కర్మాగారాల వ్యర్థాలు, హానికారక రసాయనాల వినియోగం కారణంగా వాతావరణం, వాయువు, జల కాలుష్యాలకు గురవుతున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచడమేనని, ప్రతిఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి రోజుల్లో విరివిగా మొక్కలను నాటే అభిరుచిని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.పుష్పమణి, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రాకడమణి, ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మాన్ రాజు, ఏపీఎంఐపీ పీడీ రవికుమార్, డీసీహెచ్ఎస్ పాల్‌సతీష్, ఎస్‌డీసీలు ఎం ముక్కంటి, కె.బాబ్జి, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మాలతీ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఘంటా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్‌లో మొక్కను నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

17న ఏలూరులో మాలల పాదయాత్ర

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని మాలజాతి యోధుల పోరాట సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 17న ఏలూరులో మాలల శాంతియుత పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. స్థానిక నరసింహారావుపేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద మంగళవారం పాదయాత్ర కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ర్యాలీ 17వ తేదీ ఉదయం 10 గంటలకు పాతబస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుంచి వసంత మహాల్, ఓవర్ బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంటుందని నాయకులు తెలిపారు. కలెక్టరేట్‌వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మెండెం సంతోష్ కుమార్, నేతల రమేష్ బాబు, అబ్బూరి అనిల్, నూకపెయ్యి కార్తీక్, కాపుదాసి రవి, మేరుగు సత్యనారాయణ, పాము మాన్ సింగ్, గంటా రాజేశ్వరరావు, పులవర్తి డేవిడ్, ఎరికిపాటి విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

ఏలూరు (టూటౌన్): స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లోని ప్రశాంత్ నగర్, జాలాపరమేశ్వర కాలనీ, గాయత్రి నగర్, తదితర ప్రాంతాల్లో మంగళవారం దోమల లార్వా నిర్మూలనకు పలు కార్యక్రమాలను చేపట్టారు. స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టుల కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లోని నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేశామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. ఆయా ప్రాంతంలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. నాయకులు కోన మాణిక్యం, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు

పెదపాడు : మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. బొమ్ములూరు గ్రామానికి చెందిన చామర్తి వెంకటకృష్ణారావు ఆర్థిక సాయంతో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయిల్ పామ్ రైతుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, ఇతర ఉద్యాన పంటలపైనా దృష్టి పెట్టాలని, జిల్లాలో చాక్లెట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. 2022వ సంవత్సరంలో పామాయిల్ దిగుమతిపై 49 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని తీసివేయడంతో గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఢిల్లీలో సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిని కలిశానని, వచ్చే నెలలో తాను మలేషియా వెళ్లి ఆయిల్‌పామ్ వ్యవసాయంపై అధ్యయనం చేస్తానని ఎంపీ పుట్టా చెప్పారని నాయకులు వివరించారు. ఎంపీని కలిసిన వారిలో పెదవేగి ఆయిల్ ఫెడ్ రైతు సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షుడు బొబ్బా రాఘవరావు, జాతీయ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి క్రాంతి కుమార్ ఉన్నారు.


ఎంపీ పుట్టాకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సంక్షేమం, అభివృద్ధికి గ్రహణం

- రెండు నెలలైనా స్పందించని ప్రభుత్వం
- లబ్ధిదారుల అసంతృప్తి

ఏలూరు రూరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తయింది. పెరిగిన పింఛన్ పంపిణీ తప్ప మిగిలిన సంక్షేమ పథకాల అమలుకు ఏ చర్యలూ తీసుకోలేదు. అభివృద్ధి పనుల ఊసేలేదు. కొత్త ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎప్పుడు అమలు చేస్తుందా అని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రుణం కోసం చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్ల మరమ్మతులకు చేపట్టిన చర్యలు లేవు. సాగుదారుల సాయంపై అయోమయం నెలకొంది. పేదల ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పందించడంలేదని ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.


పథకాలను చూపుతున్న మాదేపల్లి డ్వాక్రా సంఘాల సభ్యులు (ఫైల్)

వైఎస్సార్ సీపీ హయాంలో ఆనందోత్సాహాలు

గత ఐదేళ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల ఇళ్లలో ఆనందాలు వెల్లువిరిశాయి. రెక్కాడితే డొక్కాడని పేదలు సంక్షేమ పథకాలు అందుకుని ఆర్థికంగా స్థిరపడ్డారు. అమ్మఒడి, జగనన్న వసతిదీవెన, విద్యా దీవెన తదితర పథకాలద్వారా పేద పిల్లలు కాన్వెంట్, ప్రైవేటు కళాశాల చదువులు సాఫీగా సాగాయి. వాహన మిత్ర, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందుకున్న యువత ఉద్యోగం, వ్యాపార రంగాల్లో ప్రతిభ చాటారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలతో రైతులు వ్యవసాయం, చేపల సాగు రంగంలో విప్లవాత్మక మార్పు సాధించారు. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో వేల కోట్ల రూపాయలు అందుకున్న డ్వాక్రా సంఘాలు ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 74,890 మంది సంక్షేమ పథకాలు అందుకున్నారు. వీరిలో 51,578 మంది 25 డీబీటీ పథకాలు (అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర) ద్వారా రూ.159,87,42,591లను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమైంది. మరో 23,312 మంది లబ్ధిదారులకు ఎనిమిది నాన్ డీబీటీ పథకాలు (ఇంటి స్థలం, విద్యాకానుక, జగనన్న తోడు, గోరు ముద్ద, రైస్‌కార్డు, కంటి వెలు గు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, విద్యార్థులకు ట్యాబ్స్) ద్వారా రూ.106,20,56,368లు ఖర్చు కాగల సేవలు అందుకున్నారు.